సాక్షి
చిత్తూరు
మంగళవారం। 19। ఆగస్టు। 2025



వింత పోకడలతో కూటమి పాలన
కూటమి సర్కారు వింతపోకడలతో పాలన సాగిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. - 8లో



సమస్యలు పరిష్కరించండి
అయ్యా దండం పెట్టి మొరపెట్టుకుంటున్నాం.. మా సమస్యలు పరిష్కరించండని అర్జీదారులు పీజీఆర్ఎస్‌లో వేడుకున్నారు. - 8లో



ఎంపీకి బెయిల్ రావాలని..
ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని కోరు తూ కొందరు తిరుమల పాదయాత్ర చేయగా, అయ్యప్ప స్వాములు పూజలు చేశారు. - 8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు కార్పొరేషన్: తపాలా బిళ్లల సేకరణను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం దీనదయాళ్ స్పర్శ యోజన పథకం కింద ఉపకార వేతనాల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తపాలా శాఖ చిత్తూరు డివిజన్ సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు ఇందుకు అర్హులని, పాఠశాలలో ఫిలాటిలీ క్లబ్ సభ్యులై ఉండాలన్నారు. చిత్తూరులోని ప్రధాన తపాలా కార్యాలయంలో సెప్టెంబరు 30న రాతపరీక్ష ఉంటుందన్నారు. ఇందుకు విద్యార్థులు తమ దరఖాస్తుల్ని సెప్టెంబరు 16వ తేదీలోగా ఇవ్వాలని తెలిపారు.

పోలీసు గ్రీవెన్స్‌కు 35 ఫిర్యాదులు



సమస్యలు వింటున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో 35 వినతులు అందాయి. నగరంలోని ఏఆర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. వీటిలో కుటుంబతగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన సమస్యలున్నాయి. ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్ చేయడంతో పాటు నిర్ణీత గడువులోపు సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజల నుంచి ఫిర్యాదులను తీసుకున్నారు.

కోర్టుల్లో ఉద్యోగాలకు రేపటి నుంచి పరీక్షలు

చిత్తూరు లీగల్: జిల్లా న్యాయశాఖలో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీకి ఈనెల 20వ తేదీ నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మే నెలలో జారీ చేసిన ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్‌కు ఇప్పటికే దరఖాస్తు చేసుకుని, హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే పరీక్షలకు హాజరుకావాలన్నారు. కాగా తిరుపతి, చిత్తూరు, పుత్తూరులోని పలు కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించనున్నారు.

ఉచితం.. నిబంధనం

కార్వేటినగరం మండలం కత్తెరపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ అమ్మపల్లి క్రాస్ నుంచి మండల కేంద్రానికి పల్లె వెలుగు బస్సు ఎక్కింది. మహిళ ఆధార్ కార్డు కండక్టర్‌కు ఇచ్చింది. దీంతో కండక్టర్ ఆధార్‌కార్డుతోపాటు రూ.10 తీసుకున్నాడు. ఎందుకని మహిళ ప్రశ్నించగా.. మొత్తం టికెట్ ధర రూ. 20, రాయితీ పోను రూ. 10 అని బదులిచ్చారు. కండక్టర్ పొంతన లేని సమాధానంతో మహిళ విస్తుపోయింది.



అతివలు రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగానే ప్రయాణించవచ్చంటూనే కూటమి సర్కారు మెలికలు పెడుతోంది. ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగుల్లోనూ ఆంక్షలు విధించింది. ఆర్టీసీ బస్సుల్లో పెట్టిన నిబంధనలతో మండలంలోని ఓ పల్లె నుంచి మరో పల్లెకు ప్రయాణించే అవకాశాలు కూడా తక్కువయ్యాయి. బెంగళూరు, వేలూరు, తిరుత్తణి, పాండి, కృష్ణగిరి, చెన్నై, తిరువణ్ణామలై సర్వీసుల్లో జిల్లాలోనూ ప్రయాణించే వీలు లేకుండా పోయింది. అంతర్రాష్ట్ర సర్వీసులంటూ బోర్డులు పెట్టేసింది. పల్లె వెలుగులకూ సప్తగిరి రంగు మార్చకుండా మహిళలను ఉచితానికి దూరం చేస్తోంది.





అంతర్రాష్ట్ర సర్వీసు స్టిక్కర్ వేసిన ఎక్స్‌ప్రెస్ బస్సు

- జిల్లాలో ఉచిత బస్సులు అరకొరే
- సిటీ బస్సులు, అల్ట్రాడీలక్స్‌లు శూన్యం
- పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లోనూ కోతలే
- అరకొర సేవలతోనే ఉచిత బస్సు పథకం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంలో కోతలు పెడుతోంది. నాలుగు రకాల సర్వీసుల్లో ఉచితమని చెప్పి, తీరా షరతులు విధిస్తోంది. జిల్లాలో సిటీ బస్సులు, అల్ట్రా డీలక్స్ సర్వీసులు లేవు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మాత్రమే ఉన్నాయి. వాటిల్లోనూ అంతరాష్ట్ర సర్వీసుల పేరుతో కోతలు పెట్టింది. సరిహద్దుల్లో ఉచిత బస్సు తుస్సుమంటోంది. రాయితీ పేరుతో టికెట్ వసూలు చేస్తోంది. స్త్రీశక్తి పథకం వర్తించదంటూ బోర్డులు పెట్టేసింది. కండక్టర్లు ఉచితమంటే మహిళలపై చిర్రెత్తిపోతున్నారు. ఊరించిన ఉచిత బస్సు పథకం ఉసురుమనిపిస్తోంది.

అరకొరగా స్త్రీశక్తి

జిల్లాలోని 5 డిపోల పరిధిలో మొత్తం 461 బస్సులున్నాయి. ఇందులో పల్లె వెలుగు బస్సులు 246, ఎక్స్‌ప్రెస్ 73, ఏసీ బస్సులు 4, సూపర్ లగ్జరీ 32, సప్తగిరి ఎక్స్‌ప్రెస్ 35, అద్దె బస్సులు 71 వరకు ఉన్నాయి. వీటిలో నిత్యం సుమారు 1.20 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈనెల 15వ తేదీ నుంచి జిల్లాలో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలులోకి వచ్చింది. దీంతో చాలావరకు బస్సులు తారుమారు అయ్యాయి. ఎక్స్‌ప్రెస్ బస్సులు వెళుతున్న మార్గాల్లో సప్తగిరి ఎక్స్‌ప్రెస్ సర్వీసులను తిప్పుతున్నారు. పలు ఎక్స్‌ప్రెస్ బస్సులపై అంతరాష్ట్ర సర్వీసు అనే బోర్డు పెట్టేశారు. దీంతో ఉన్న బస్సుల్లో కోత పెట్టారు. పల్లె వెలుగు బస్సులను సైతం అంతరాష్ట్ర సర్వీసులుగా తిప్పుతూ, వాటిలో చాలా వరకు షరతులు పెట్టేశారు. దీంతో జిల్లాలో స్త్రీ శక్తి పథకం అరకొరగా అమలవుతోంది.

సప్తగిరి పేరుతో గోల్‌మాల్

కాణిపాకం నుంచి తిరుపతికి గతంలో ఎక్స్‌ప్రెస్ నడిచేది. ఉచిత బస్సు పథకం అమలుతో దాని స్థానంలో సప్తగిరి ఎక్స్‌ప్రెస్ నడుపుతున్నారని కాణిపాకం వాసులు మండిపడుతున్నారు. అలాగే సప్తగిరి ఎక్స్‌ప్రెస్ అన్‌ఫిట్ కావడంతో వాటిని పల్లె వెలుగు కింద మార్చేశారు. కానీ వాటికి పల్లె వెలుగు పెయింటింగ్ వేయకుండా అలానే తిప్పుతున్నారు. ఈ బస్సుల్లో ఉచితం ప్రశ్నార్థకంగా మారింది. ఇలా అన్‌ఫిట్ అయిన బస్సులు 9 వరకు కుప్పంలో తిప్పుతున్నారు.

బస్సులు అరకొరే..

కూటమి ప్రభుత్వం ఈ నెల 15వ తేదీన సాయంత్రం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం శనివారం నుంచి పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. అయితే ఆ పథకంలో పెట్టిన షరతులతో మహిళా ప్రయాణికులు అయోమయంలో పడుతున్నారు. జిల్లాలోని 5 ఆర్టీసీ డిపోల్లో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులు మొత్తం 319 ఉండగా.. మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి 246 బస్సులను కేటాయించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. పల్లెవెలుగు 27 బస్సులు, ఎక్స్‌ప్రెస్ 45 బస్సులు మొత్తం 73 బస్సులు అంతరాష్ట్ర సర్వీసుల పేరుతో తిప్పుతున్నారు. బెంగళూరు, తమిళనాడులోని వేలూరు, తిరుత్తణి, పాండి, కృష్ణగిరి, చెన్నై, తిరువణ్ణామలై తదితర ప్రాంతాలకు తిరుగుతున్నాయి.

సరిహద్దులో ఉచితం లేదా..?

సరిహద్దు ప్రాంతాల్లోని ప్రయాణికులు ఉచితానికి దూరమవుతున్నాయి. కార్వేటినగరం, ఎస్ఆర్‌పురం, నగరి, పుత్తూరు, చిత్తూరు, గుడిపాల, యాదమరి, కుప్పం, వి.కోట, రామకుప్పం, పలమనేరు, శాంతిపురం, తదితర ప్రాంతాల్లో ఉచితానికి బదులు రాయితీలు ఇస్తున్నారు. దీంతో మహిళలు ఉచిత పథకంపై విరుచుకుపడుతున్నారు.

టికెట్ తీసుకో.. బస్సెక్కు..

టికెట్లు తీసుకుంటేనే ఈ బస్సులో ఎక్కాలని కండక్టర్లు చెప్పడంతో మహిళలు బస్సు దిగేస్తూ.. కూటమి ప్రభుత్వంపై చిర్రుబుర్రులాడడం కనిపించింది. వెంటనే అదే మార్గంలో నడిచే మరో ఎక్స్‌ప్రెస్ బస్సును ప్లాట్‌ఫాంపైకి తెచ్చారు. ప్రయాణికులు అందులో ఎక్కేందుకు ప్రయత్నించగా ఈ బస్సులో మహిళలు టికెట్లు తీసుకోవాలంటూ కండక్టర్ చెప్పడంతో ప్రయాణికులు ఆశ్చర్యపోయారు. అదేంటి ఇది ఎక్స్‌ప్రెస్.. అది ఎక్స్‌ప్రెస్ కదా? అని బస్సు సిబ్బందిని అడిగితే మాకు తెలియదంటూ సమాధానం ఇస్తున్నారు. ప్రధాన స్టాపింగ్‌లో దిగేందుకు కూడా స్త్రీశక్తి పథకం వర్తించదంటున్నారు. సాయంత్రం వేళల్లో మహిళలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కండక్టర్లు బస్సు ఎక్కనివ్వడం లేదు. టికెట్లు తీసుకోవాలని చెబుతున్నారు. మహిళలను ఛీకొడుతున్నారు. పల్లె వెలుగు బస్సులు ఫుల్ అయితే డొక్కు బండమ్మా..తట్టుకో లేదంటూ వెళ్లిపోతున్నారు.

ఒరిజినల్ కార్డు లేకపోతే టికెట్ కొనాల్సిందే..

ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణంపై ఆంక్షలతో సర్కారు వారికి ఉచిత ప్రయాణం దూరం చేసేందుకు కొత్త ఎత్తులు వేస్తోంది. ఉచిత ప్రయాణానికి మహిళలు తమ ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, రేషన్ కార్డులు ఒరిజినల్ చేత పట్టుకుని రావాలని కండక్టర్లు హెచ్చరిస్తున్నారు. జిరాక్స్‌లు, ఫోన్లలో కార్డులను చూపిస్తే చెల్లుబాటు కావని కండక్టర్లు టికెట్లు కొడుతున్నారు.



ప్రయాణంలో మహిళలే అధికం



జిల్లాలోని ఆర్టీసీ బస్సుల్లో రోజువారీగా సుమారు 1.20 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటే.. ఇందులో అత్యధికంగా మహిళలే ఉన్నారు. 50నుంచి 60 శాతం మంది మహిళలు, 30నుంచి 40 శాతం పురుషులు, 10నుంచి 20 శాతం విద్యార్థులు ప్రయాణిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు లెక్కలు చెబుతున్నారు. ప్రధానంగా మహిళలు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సప్తగిరి సర్వీసులనే ప్రయాణం సాగిస్తున్నారని పరిశీలనలో గుర్తించినట్లు చెబుతున్నారు. అయినా మహిళలకు ఉచిత పథకం పథకం అరకొరగానే అందుతోంది.

రాయితీలు ఎందుకు.. ఉచితమివ్వాలి



ఎన్నికల సమయంలో ఉచిత ప్రయాణం అన్నారు. ఇప్పుడు ఆ బస్సులోనే ఎక్కాలంటున్నారు. అదే బస్సు ఎక్కిన కూడా టికెట్లు కొడుతున్నారు. సరిహద్దులో ఉండడం మా తప్పా. ఉచితమని చెప్పి మమల్ని ఇలా చేయడం కరెక్టు కాదు. ప్రభుత్వం చెప్పిన విధంగానే ఉచితం ఇవ్వాలి. ఇలా చేయడం కరెక్టు కాదు. అప్పుడు ఒక మాట. ఇప్పుడు ఒక మాట అంటే ఎలా.

–పాపమ్మ, కార్వేటినగరం


డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లకు అవకాశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు రాష్ట్ర ఉన్నతాధికారులు అవకాశం కల్పించారని జిల్లా నోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.జీవనజ్యోతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా డిగ్రీ కళాశాలల్లో ఈ నెల 18వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు తెలిపారు. ఇంటర్ ఉత్తీర్ణత చెందిన విద్యార్థులు ఈ అడ్మిషన్ల ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చిత్తూరు పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ, బీకాం, బీబీఏ, బీఎస్సీ, ఎలక్ట్రానిక్స్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. ఎంతో ఘన చరిత్ర ఉన్న పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు అడ్మిషన్లు పొందాలన్నారు. సందేహాల నివృత్తికి బీఏ(9494368020), బీకాం (9849959423), బీఎస్సీ (9985165051) నెంబర్‌లలో సంప్రదించాలని ఆమె కోరారు.



జీవనజ్యోతి

రేయింబవళ్లు కిక్కే కిక్కు



వేళాలేదు.. పాళాలేదు.. రేయింబవళ్లు మందుబాబులకు ఇక్క కిక్కే కిక్కు. తాగినోడికి తాగినంత తాపడమే కూటమి లక్ష్యం. కొత్త మద్యం బార్ల పాలసీతో పొద్దస్తమానం మద్యం అందుబాటులోకి రానుంది. ఇప్పటికే ఏరులై పారుతున్న మద్య ప్రవాహం ఇకపై మరింత ఉధృతం కానుంది. దీంతో మందుబాబులకు కిక్కు తగ్గే అవకాశమే ఉండదు. అయితే సర్కారుకు మాత్రం రాబడి పెరగనుంది.

ఇక మద్యం బార్ల వంతు..!

- నేటి నుంచి దరఖాస్తులు.. 26న ఆఖరు
- 28న లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయింపు
- జిల్లాలో 11 బార్ల గుర్తింపు.. ఒకటి 'గీత' కులాలకు
- బార్ల పనివేళలు మరో మూడు గంటలు పెంపు
- తాగినోడికి తాగినంత.. రోజంతా కిక్కు

చిత్తూరు అర్బన్: జిల్లాలో ఏరులైపారుతున్న నూతన మద్యం పాలసీకి.. కొత్త మద్యం బార్ల పాలసీ తోడవుతోంది. జిల్లాలో 11 మద్యం బార్లకు నోటిఫికేషన్ ఇస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇక తెల్లవారి నుంచి అర్ధరాత్రి వరకు తాగినోడికి తాగినంత మద్యం పోయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా స్పష్టమవుతోంది.

పాలసీలోని ప్రధానాంశాలివీ..

చిత్తూరులో 7, కుప్పం, నగరి, పుంగనూరు, పలమనేరు మున్సిపాలిటీల్లో ఒక్కో మద్యం బారు ఏర్పాటుకు లైసెన్సులు మంజూరు చేస్తారు. కుప్పంలో మాత్రం ఏటా లైసెన్సు ఫీజు రూ.35 లక్షలుగా నిర్ణయించారు. మిగిలిన అన్ని చోట్ల లైసెన్సు ఫీజు ఏటా రూ.55 లక్షలు చెల్లించాలి. ప్రతి ఏటా 10 శాతం పెరుగుతుంది. మంగళవారం నుంచి www.oc.hpfsproject.com అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులను సమర్పించాలి.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ, ఈఎస్

ఇది కాకుండా చిత్తూరులోని ఎక్సైజ్ ఈఎస్ కార్యాలయంలో కూడా ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి బారుకు తప్పనిసరిగా నాలుగు దరఖాస్తులు వస్తేనే లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయిస్తారు. ఒక వ్యక్తి ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. లాటరీలో ఎన్ని బార్లకైనా లైసెన్సులు పొందొచ్చు. ప్రతి దరఖాస్తుకు రూ.5.10 లక్షల నాన్-రీఫండబుల్ రుసుము చెల్లించాలి. ఈనెల 26వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు పూరించి అందజేయాలి. 28వ తేదీ ఉదయం 8 గంటలకు చిత్తూరు కలెక్టరేట్ కార్యాలయంలోని డీఆర్‌డీఏ హాలులో లాటరీ పద్ధతిలో లైసెన్సులు కేటాయిస్తారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి నూతన మద్యం బార్ పాలసీ అమల్లోకి వస్తుంది. లైసెన్సు కాలపరిమితి మూడేళ్లుగా నిర్ణయించారు. చిత్తూరులో ఒక మద్యం బారును కల్లుగీత కులాల్లోని ఈడిగ సామాజిక వర్గానికి రిజర్వు చేశారు. వీళ్ల లైసెన్సు ఫీజులో 50 శాతం రాయితీ పోనూ.. రూ.27.50 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. చిత్తూరు జిల్లాకు చెందిన వారు మాత్రమే ఈ దుకాణానికి దరఖాస్తు చేసుకోవాలి.

అర్ధరాత్రి వరకు అనుమతి..

గత ప్రభుత్వ హయంలో మద్యం బార్ల లైసెన్సు ఫీజులు భారీగా ఉండడంతో పాటు బారు పనివేళలు కుదించారు. ఉదయం 11 నుంచి రాత్రి 11 గంటల వరకే మద్యం బార్లకు అనుమతి ఉండేది. కానీ నేడు ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు మద్యం బార్లు అందుబాటులో ఉంటాయి. అంటే మద్యం దుకాణాలు మూసేసిన తరువాత కూడా రెండు గంటల పాటు బార్లలో మద్యం అందుబాటులో ఉంటుంది. బార్ లైసెన్సు వచ్చిన తరువాత రెస్టారెంట్ లైసెన్సును 30 రోజుల్లో తీసుకుంటే సరిపోతుంది. ఇక లైసెన్సు దక్కించుకున్న వారు మొత్తం వార్షిక ఫీజును ఆరు కంతుల రూపంలో చెల్లించే వెసులుబాటు కల్పించారు. మొత్తంగా నూతన మద్యం బార్ల పాలసీలో మందు బాబులకు అర్ధరాత్రి వరకు తాగించి.. ఆదాయం పెంచుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. మద్యం దుకాణాలను దక్కించుకోవడంలో కీలకపాత్ర పోషించిన కూటమి నేతలు.. బార్లను వదులుకునే కనిపించడంలేదు. ఒక వేళ కొత్త వాళ్లకు వచ్చినా, తమను వాటాదారులు చేర్చుకోవాల్సిందేనని సంకేతాలు పంపిస్తున్నారు.

రోజుకు సగటున రూ.1.50 కోట్ల వ్యాపారం

జిల్లాలో ప్రస్తుతం 113 మద్యం దుకాణాలు, 350కి పైగా అనధికారిక పర్మిట్ గదులు, 3 వేలకు పైగా బెల్టు దుకాణాలు ద్వారా రోజుకు సగటున రూ.1.50 కోట్ల మద్యం వ్యాపారం సాగుతోంది. ఇక నూతన మద్యం బార్ల పేరిట జిల్లాలో 11 చోట్ల బార్ లైసెన్సులు మంజూరు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారం చిత్తూరు నగరంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్, ఈఎస్ శ్రీనివాస్ కలిసి నూతన మద్యం బార్ పాలసీ నోటిఫికేషన్ విడుదల చేశారు. జిల్లాలో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి మూడేళ్ల పాటు అమల్లో ఉండేలా కొత్త బార్ లైసెన్సులు మంజూరు చేయనున్నారు.

దివ్యాంగులంటే అలుసెందుకు?

- పరిశీలన పేరుతో జిల్లాలో 4,732 దివ్యాంగ పింఛన్లు కోత
- మేమంతా నిజమైన దివ్యాంగులమేనంటూ ఆందోళన
- సోమవారం కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన దివ్యాంగులు



దివ్యాంగులతో వాగ్వాదం చేస్తున్న పోలీసులు

చిత్తూరు కలెక్టరేట్ : తామంటే అలుసెందుకంటూ దివ్యాంగులు కలెక్టరేట్ ఎదుట కదం తొక్కారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క నూతన పింఛన్ ఇవ్వకపోగా...ఉన్న పింఛన్లలో కోతలు విధిస్తోంది. ప్రతి సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌కు వందల సంఖ్యలో నూతన పింఛన్ల మంజూరు కోసం అర్జీలు ఇస్తున్నారు. ఆ అర్జీలను అధికారులు బుట్టదాఖలు చేస్తున్నారే తప్ప న్యాయం చేయడం లేదు. అసలే వైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులపై కూడా కూటమి సర్కారు కన్నెర్ర చేసింది. తాజాగా ఆగస్టు నెలలో చిత్తూరు జిల్లాలోని 4,732 దివ్యాంగ పింఛన్లను తొలగించింది. దీంతో పింఛన్ తొలగించిన దివ్యాంగ లబ్ధిదారులు వందలాది మంది చిత్తూరు కలెక్టరేట్‌కు విచ్చేశారు. తమ సదరం సర్టిఫికెట్లను చేతపట్టుకుని కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదిక భవనం ముందు బైఠాయించి, తమకు న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు.

దివ్యాంగులని అనిపించడం లేదా?

చూడగానే వైకల్యం కనిపిస్తున్నా దివ్యాంగులు...నిజమైన దివ్యాంగులనిపించడం లేదా అని దివ్యాంగుల ఐక్యకార్యచరణ సమితి (జేఏసీ) రాష్ట్ర అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



కలెక్టరేట్ ఎదుట దివ్యాంగుల సమస్యలు వింటున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రీ అసెస్‌మెంట్ పేరుతో దివ్యాంగ పింఛన్ల ఏరివేతకు ప్రాధాన్యమిచ్చిందని మండిపడ్డారు. ఎన్నో ఏళ్లుగా దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వేలాది మంది అనర్హులంటూ పింఛన్లు తొలగించడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. గతంలో వైద్యుల బృందం నిర్ధారించి సర్టిఫికెట్లు అందజేసి పింఛన్లు పొందుతున్న దివ్యాంగులకు తాజాగా నోటీసులు జారీ చేసి పింఛన్ తొలగించడం దారుణమన్నారు.

న్యాయం చేయకపోతే ఆందోళనలు ఉధృతం

తొలగించిన పింఛన్లను తిరిగి కొనసాగించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని దివ్యాంగుల ఐక్య కార్యచరణ సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మురళి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగులపై వ్యవహరిస్తున్న అలసత్వ ధోరణి అన్యాయమన్నారు. దివ్యాంగులపై చిన్నచూపు చూస్తే దారుణమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. పింఛన్లపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న వేలాది మంది దివ్యాంగులు పొట్టకొట్టడం సబబు కాదన్నారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ దివ్యాంగుల ధర్నా వద్దకు విచ్చేసి వారి సమస్యలను అరగంట సేపు ఓపికగా విని, పరిశీలించారు. పింఛన్లు కోల్పోయిన వందలాది మంది దివ్యాంగులు కన్నీటితో కలెక్టర్‌కు తమ సమస్యలను విన్నవించుకున్నారు. గతంలో వారికి అందజేసిన సర్టిఫికెట్‌లను కలెక్టర్ స్వయంగా పరిశీలన చేశారు. తప్పనిసరిగా పునఃపరిశీలన చేసి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

వివరాలు ముందుగా తెలపాలి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సంబంధించి ఉద్యోగోన్నతులు, డిప్యూటేషన్‌లు, ఓడీ ఏర్పాట్లు చేసేటప్పుడు ముందస్తుగా వివరాలు తెలియజేయాలన్నారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారం గ్రామ, వార్డు సచివాల ఉద్యోగులకు సంబంధించి చేపట్టాల్సిన నియమ, నిబంధనలు పేర్కొన్నారు. ఉద్యోగోన్నతులు, ఓడీ, డిప్యూటేషన్లను ఇష్టానుసారంగా చేసేందుకు వీలు లేదన్నారు. ఏ ప్రక్రియ చేపట్టినా ముందస్తుగా గ్రామ, వార్డు సచివాలయ శాఖకు ముందస్తుగా తెలియజేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

బాబుపాలనలో మోసం గ్యారెంటీ



పుంగనూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న రెడ్డెప్ప, అలీమ్‌బాషా, ఫక్రుద్దిన్‌షరీఫ్, అమ్ము

పుంగనూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో ఆయన ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి అమలు చేయకుండా ప్రజలను మోసగించడం మాత్రం గ్యారెంటీ అని, అలాంటి చంద్రబాబును నమ్మవద్దని చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప ప్రజలను కోరారు. సోమవారం పట్టణంలోని కట్టకిందపాళెంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొండవీటి నాగభూషణంతో కలసి బాబు షూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ విడుదల చేసిన స్కానర్లు, క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ప్రజలకు పంపిణీ చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, సీమ జిల్లాల మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫక్రుద్దీన్‌షరీఫ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఇర్ఫాన్, మున్సిపల్ వైస్ చైర్మన్లు నాగేంద్ర, లలిత, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అమరేంద్ర, కౌన్సిలర్లు కాంతమ్మ, గంగులమ్మ, భారతి, పూలత్యాగరాజు, రెడ్డెమ్మ, రేష్మా, భారతి, నూర్జహాన్, సాజిదాబేగం, నటరాజ, కాళిదాసు, కిజర్‌ఖాన్, జెపి.యాదవ్, నాయకులు ఎస్‌వీటీ.సోము, ఎస్‌వీటీ కిషోర్, రాజేష్, అస్లాంమురాధి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భార్య హత్య కేసులో భర్త అరెస్టు


హరిబాబును అరెస్టు చూపుతున్న పోలీసులు

బంగారుపాళెం: భార్యను హత్య చేసిన సంఘటనలో సోమవారం భర్తను అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కొదలమడుగు గ్రామం బీసీ కాలనీకి చెందిన హరిబాబు ఈ నెల 16 వతేదీన తన భార్య ప్రియాంకను హత్య చేసిన విషయం తెలిసిందే నన్నారు. ఈ కేసుకు సంబంధించి హరిబాబును మొగిలి గ్రామం వద్ద అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచినట్లు తెలిపారు.

శ్రీగంధం చెక్కల పట్టివేత

- నలుగురి అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న గుడుపల్లె పోలీసులు

గుడుపల్లె: తమిళనాడు రాష్ట్రానికి చెందిన నలుగురు వ్యక్తులు గుడివంక అటవీ ప్రాంతంలో శ్రీగంధం చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం గుడుపల్లె జెడ్పీ హైస్కూల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా నలుగురు వ్యక్తులు వాహనాల్లో వస్తుండగా పట్టుకున్నారు. వారివద్ద 6.5 కిలోల శ్రీగంధపు దిమ్మెలు ఉండగా గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, తమిళనాడు రాష్ట్రానికి చెందిన గోవిందరాజులు, తిరుపతి, రామలింగం, శివశక్తి అని తెలిసింది. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి


దుర్గ మృతదేహం

కుప్పంరూరల్: ఓ వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటన కుప్పం మండలం, తంబిగానిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. కుప్పం సీఐ శంకరయ్య కథనం మేరకు.. తంబిగానిపల్లికి చెందిన సింగారవేలు, కంగుంది గ్రామానికి చెందిన దుర్గా (27)తో 2017లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు మగ పిల్లలు, ఒక ఆడపిల్ల ఉన్నారు. కొంత కాలంగా దుర్గ కడుపు నొప్పితో బాధపడుతూ ఉండేది. ఈ క్రమంలో సోమవారం దుర్గ ఇంట్లో ఫైకప్పునకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ మేరకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఆత్మహత్యపై తమకు అనుమానాలు ఉన్నాయని దుర్గ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త, అత్తింటి వారి వేధింపులే కారణమని ఫిర్యాదులో పేర్కొన్నారు. కుప్పం సీఐ శంకరయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అయ్యా దండం పెడుతున్నాం..

సమస్యలు పరిష్కరించండి

- సమస్యలు పరిష్కరించాలని అర్జీదారుల మొర
- వివిధ సమస్యలపై 324 అర్జీలు నమోదు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : అయ్యా దండం పెట్టి మొర పెట్టుకుంటున్నాం.. తమ సమస్యలను పరిష్కరించండని అర్జీదారులు ఉన్నతాధికారుల ఎదుట కన్నీరు మున్నీరయ్యారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని ఉన్నతాధికారులకు అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడేల్, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీఓ శ్రీనివాసులు, ఏఓ వాసుదేవన్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి 324 అర్జీలు నమోదయ్యాయి.

ఇంటి పట్టా ఇప్పించండయ్యా

చాలా ఏళ్లుగా సొంత ఇళ్లు లేక అద్దె ఇళ్లలో ఉంటున్నామని, ఇళ్ల పట్టాలు ఇప్పించాలని గుడిపాల మండలంలోని మండికృష్ణాపురం, మాదిగపల్లి, పెరుమాళ్లకుప్పం గ్రామాలకు చెందిన ప్రజలు కోరారు. ఆయా గ్రామస్తులు ధనంజయ, రాజేంద్ర మాట్లాడుతూ ఎస్సీలైన తమకు సొంత ఇళ్లు లేక అవస్థలు ఎదుర్కొంటున్నామని, తమ గ్రామంలో సర్వే నంబర్ 141లో 36 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఆ భూమిని పరిశీలించి ఇళ్లు లేని తమకు కేటాయించాలని కోరారు.


న్యాయం చేయాలని దండం పెట్టి వేడుకుంటున్న అర్జీదారుడు


ఇంటి పట్టా ఇప్పించాలని కోరుతున్న ఎస్సీలు

వితంతు పింఛన్ ఇప్పించండయ్యా

తనకు వితంతు పింఛన్ ఇప్పించడయ్యా అని గంగవరం మండలం పత్తికొండగ్రామానికి చెందిన నాగమ్మ వాపోయారు. ఆమె మాట్లాడుతూ తనకు ఎలాంటి జీవనాధారం లేదన్నారు. వితంతు పింఛన్ కోసం సచివాలయం, మండల కార్యాలయం చుట్టూ తిరిగినా లాభం లేదన్నారు. దయతో వితంతు పింఛన్ మంజూరు చేయాలని కోరారు.


పింఛన్ ఇప్పించాలని కోరుతున్న నాగమ్మ

దారి సమస్య పరిష్కరించాలి


దారి సమస్య పరిష్కరించాలని కోరుతున్న మహాసముద్రం వాసులు

దారి సమస్య పరిష్కరించాలని బంగారుపాళెం మండలం మహాసముద్రం గ్రామానికి చెందిన కేశవయ్య కోరారు. ఆ గ్రామస్తులు పీజీఆర్ఎస్‌లో అర్జీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన రాజమ్మ గ్రామ ఖాతా నంబర్ 119/4 ఏ లో తన పేరుపై 35 సెంట్లు, ఖాతా నంబర్ 118/ఏ లో 1.02 ఎకరాల భూమి ఉందన్నారు. తమ పొలానికి వెళ్లడానికి దారి లేక అవస్థలు ఎదుర్కొంటున్నామన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి తమకు దారి సమస్య కల్పించాలని కోరారు.

దివ్యాంగ పింఛన్ ఇప్పించండయ్యా


పింఛన్ ఇప్పించాలని కోరుతున్న నరేష్

దివ్యాంగ పింఛన్ ఇప్పించడయ్యా అంటూ బాధితుడు నరేష్ కోరాడు. జిల్లాలోని ఎస్ఆర్ పురం మండలం కటికపల్లికి చెందిన దివ్యాంగుడు నరేష్ సోమవారం పీజీఆర్ఎస్ లో అర్జీ అందజేశాడు. చాలా నెలలుగా కొత్త దివ్యాంగ పింఛన్ కోసం అర్జీలు ఇస్తూనే ఉన్నానని తెలిపారు. అయితే న్యాయం జరగడం లేదన్నాడు. తనకు దివ్యాంగ పింఛన్ మంజూరు చేయించాలని కోరాడు.

గ్రానైట్ బండగా చూపిస్తున్నారు

ఎన్నో ఏళ్లుగా తమ గ్రామానికి సమీపంలో ఉన్న ఎద్దులబండపై తాము పండించుకునే పంటలను ఆరబెట్టుకుంటున్నామని, అయితే ప్రస్తుతం ఆ బండను గ్రానైట్ బండగా చూపిస్తున్నారని వెదురుకుప్పం మండలం కొమ్మరగుంట వాసులు వాపోయారు. ఆ గ్రామస్తులు నారాయణరెడ్డి, శాంతమ్మ మాట్లాడుతూ చాలా ఏళ్లుగా తమ గ్రామంలోని రైతులు సమీపంలో ఎద్దులబండపై తమ గ్రామంలో పండించే రాగులు, వరి, వేరుశనగ ఉత్పత్తులను ఆరబెట్టుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఆ బండను గ్రానైట్ బండగా చూపించి కూల్చడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. న్యాయం చేయాలని కోరారు.


కూల్చకుండా న్యాయం చేయాలని కోరుతున్న కొమ్మరగుంట వాసులు

బోయకొండ పాలకమండలికి 13 దరఖాస్తులు


ఈఓకు దరఖాస్తులను అందజేస్తున్న లక్ష్మణ్‌రాజు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయ నూతన పాలకమండలి సభ్యత్వానికి 13 మంది సభ్యుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఆలయ ఈఓ ఏకాంబరం తెలిపారు. ఈ నెల7వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం చౌడేపల్లె మండలం ఎర్రగానిపల్లెకు చెందిన ఎం.లక్ష్మణ్‌రాజు(పతిరాజు), పాలక మండలి సభ్యత్వానికి మరో 12 మంది టీడీపీ నేతలతో కలిసి దరఖాస్తులను ఆలయ పరిపాలన కార్యాలయంలో ఈఓకు అందజేశారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని, ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటరమణరాజు, ప్రదీప్‌రాజు, సీవీ రెడ్డి, మాధవరెడ్డి, హరిప్రసాద్, కార్తీక్, ప్రహ్లాద, రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు గంగమ్మగుడి విద్యార్థి


మధును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీరంగరాజపురం: జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు మండలంలోని గంగమ్మగుడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి ఎన్. మధు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కళావతి సోమవారం తెలిపారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో మధు పాల్గొని, ఉత్తమ ప్రతిభను కనబరచడంతో జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు. కాగా ఈనెల 22 నుంచి 24 వరకు బిహార్‌లోని బుద్ధగయాలో జరిగే పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టులో ప్రాతినిథ్యం వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మధును ఉపాధ్యాయులు లోకనాథం, బాలాజీ, చంద్రశేఖర్, బాబు, పద్మశ్రీ, సత్య, జానకి, సరోజమ్మ, ప్రసన్నకుమారి, అరుణ అభినందించారు.

దారి దోపిడీ దొంగల అరెస్టు

- రూ. 2 లక్షల విలువైన సొత్తులు స్వాధీనం
- ముగ్గురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



నిందితులతో సీఐ, ఎస్ఐ, పోలీసులు

నగరి : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో దోపిడీ దొంగలు పి.సతీష్ (19), ఆర్.శంకర్ అలియాస్ అజిత్ (20), ఎంఎస్ విజయకుమార్ (20)ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ విక్రమ్ కథనం మేరకు.. మోటార్ సైకిల్‌లో ఒంటరిగా వెళుతున్న వృద్ధులను టార్గెట్ చేసి వారి వద్ద నగదు, మొబైలు ఫోన్‌లు బలవంతంగా తీసుకోవడం, నగదు ఇవ్వకుంటే వారిపై దాడి చేసి గాయపరచడం తదితర దారి దోపిడీ సంఘటనలపై గత రెండు నెలలుగా నగరి పోలీస్ స్టేషన్ మూడు కేసులు నమోదు అయ్యాయి. వీటిని నివారించేందుకు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ పర్యవేక్షణలో ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం 7 గంటలకు అందిన సమాచారం మేరకు, ఇన్‌స్పెక్టర్‌తో పాటు, నగరి ఎస్ఐ విజయనాయక్, ట్రైనీ ఎస్ఐ మారెప్ప, సిబ్బందితో వెళ్లి నగరి–తిరుత్తణి మెయిన్ రోడ్డు కీళపట్టు ఆంజనేయ స్వామి గుడి వద్ద మోటార్ సైకిల్‌పై వస్తున్న నిందితులు నగరి కాలనీకి చెందిన సతీష్, వేలావడికి చెందిన శంకర్ అలియాస్ అజిత్, కరకంతాపురం కాలనీకి చెందిన విజయ్‌ను అరెస్టు చేశారు. వారిని విచారించగా పలు చోరీల్లో వారు ముద్దాయిలుగా తేలింది. దీంతో వారి వద్ద నుంచి ల్యాప్టాప్, ఫ్యాన్, గ్యాస్ సిలిండర్, బైకు, నోకియా సెల్‌ఫోన్, రూ.37570 నగదు తదితర రూ. 2 లక్షల మేర సొత్తును స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు. దారిదోపిడీ దొంగల అరెస్టులో ప్రతిభ చూపిన పోలీసులు లోకనాథం, ఇంద్ర కుమార్, గజేంద్ర, సురేష్, నవీన్, సత్య, గోపి, రవి, కదిర్ వేలుకు డీఎస్పీ ప్రశంసించారు.

రాష్ట్ర వాలీబాల్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ


వాలీబాల్ జట్టులో అర్హత సాధించిన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్రస్థాయిలో నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రతిభ సాధించి ఎంపికయ్యారు. సోమవారం వాలీబాల్ కోచ్, పీఈటీ ఉమాపతి మాట్లాడుతూ వరల్డ్ స్కూల్ వాలీబాల్ చాంపియన్‌షిప్ అండర్–15 బాల, బాలికలకు డిసెంబర్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారన్నారు. డిసెంబర్ 4 నుంచి 13వ తేదీ వరకు చైనా దేశం షాంగ్లూవో నగరంలో పోటీలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా స్థాయి నుంచి ఎంపికలు జరిగాయన్నారు. ఈ నెల 18వ తేదీన రాష్ట్రస్థాయిలో విజయవాడలోని పడమట జెడ్పీ హైస్కూల్‌లో ఎంపికలు నిర్వహించారన్నారు. ఈ ఎంపికల్లో ఎంపికైన ఏపీ టీంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని విద్యార్థులు ప్రతిభ చూపి, స్థానం సంపాదించారని తెలిపారు. బాలుర విభాగంలో చౌడేపల్లికి చెందిన నిరంజన్, సోమలకు చెందిన దస్తగిరిబాషా, బాలికల విభాగంలో తిరుపతికి చెందిన కుమారి, దేవి శ్రీ అర్హత సాధించారని ఆయన వెల్లడించారు. అనంతరం ఆ విద్యార్థులను పలువురు అభినందించారు.

ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని

తిరుమలకు పాదయాత్ర


తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రొంపిచెర్ల: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని కోరుతూ అన్నమ్మయ్య జిల్లా పీలేరు నియోజక వర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పాదయాత్ర చిత్తూరు జిల్లా రొంపిచెర్ల మండలంలోని రొంపిచెర్ల క్రాస్ రోడ్డుకు చేరింది. ఈ సందర్భంగా రొంపిచెర్ల జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్ రెడ్డి వారికి స్వాగతం పలికి, తన మద్దతు తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులు మాట్లడుతూ సూపర్‌సిక్స్ పథకాలను బయట పెడుతున్నారనే వైఎస్సార్ సీపీ నాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ఆరోపించారు. ఈ పాదయాత్రలో వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ రెడ్డి, అధికార ప్రతినిధి సుంకర చక్రధర్, మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లీశ్వరి, మైనార్టీ మహిళా విభాగం నియోజక వర్గం కార్యదర్శి శాన్వాస్ బేగం, నేతలు లోకనాథరెడ్డి, భువనేశ్వర్ రెడ్డి, కాలనీ చిన్ని, పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, షాకీర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాముల పూజలు

రొంపిచెర్ల: అక్రమ మద్యం కేసులో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డికి బెయిల్ రావాలని కోరుతూ రొంపిచెర్ల మండలం మోటుమల్లెల శివాలయంలో అయ్యప్ప స్వాములు సోమవారం పూజలు చేసి, కొబ్బరి కాయలు కొట్టారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు రెడ్డీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ నీతి నిజాయితీతో పని చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డిపై అక్రమంగా మద్యం కేసు పెట్టి, అరెస్టు చేశారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశాంత్ రెడ్డి, శ్రీకాంత్, అమరనాథరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, కరుణాకర్ పాల్గొన్నారు.

రెండు రోజుల్లో మామిడి సబ్సిడీ సర్వే పూర్తి చేయండి

- సమీక్షల్లో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా తోతాపురి మామిడికి అందించే సబ్సిడీ సర్వేను రెండు రోజుల్లోపు కచ్చితంగా పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో కలెక్టర్ వరుస సమీక్షలు నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడారు. మండలాల వారీగా మామిడి సబ్సిడీ సర్వే వివరాల హార్డ్ కాపీలు ఈ నెల 20వ తేదీలోపు సంబంధిత ఆర్ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు, మండల బృందానికి అందజేయాలన్నారు. సంతకాలు చేసిన కాపీలను ఈ నెల 23వ తేదీ లోపు ఉన్నతాధికారులకు సమర్పించాలన్నారు. జేసీ విద్యాధరి, వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ, ఉద్యానవన శాఖ జేడీ మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్‌ల తొలగింపు పై ఆరా

జిల్లా వ్యాప్తంగా అక్రమంగా తొలగించిన పింఛన్లపై కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ స్పందించారు. సోమవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో అర్హులైన ప్రతి దివ్యాంగునికి పింఛన్ అందించేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పింఛన్‌దారుల అర్హతలను పునఃపరిశీలించి అర్హులకు పింఛన్‌లు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల కమిషన్ బీజేపీ చేతిలో కీలుబొమ్మ

మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



కార్వేటినగరం: ఎన్నికల కమిషన్ బీజేపీ చేతిలో కీలు బొమ్మగా మారి, పోలింగ్ వ్యవస్థను తారుమారు చేసి ఆ పార్టీకి వంత పాడుతోందని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. సోమవారం నారాయణస్వామి పుత్తూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా నిర్వహించాల్సిన ఎన్నికలను ఎన్నికల కమిషన్ బీజేపీకి వంత పాడుతూ ప్రజల ఓటుహక్కును కాలరాసిందని ఆరోపించారు. పోలింగ్ బూత్‌లో ప్రజలు వేసిన ఓట్లు ఏమయ్యాయని, దీనికి ఎన్నికల కమిషనే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడని విధంగా బీజేపీ ఎన్నికల కమిషన్‌ను గుప్పెట్లో పెట్టుకుని ఎన్నికలు జరిపిస్తోందని, ప్రశ్నిస్తే కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తోందని విమర్శించారు. ఎన్నికల కమిషన్ బీజేపీ కలసి చేసిన ఓట్ల చోరీ నిర్వాహకంపై దేశవ్యాప్తంగా చర్చించుకుంటోందన్నారు. ఓటర్ల సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై ఉందన్నారు.

దివ్యాంగులపై కూటమి క్రూరత్వం

వెదురుకుప్పం: సూపర్‌సిక్స్ అమలు చేస్తున్నామని చెబుతూ మరో పక్క దివ్యాంగులు, పేదలు, ఆటో కార్మికుల కడుపు కొట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. సోమవారం మండలంలోని ధర్మాచెరువు గ్రామంలో పర్యటన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రపంచ చరిత్రలోనే సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారులకే డబ్బులు అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు. సమాజంలో పేదరికంతో మగ్గిపోతున్న బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేసినట్లు గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య రంగాన్ని గాలికొదిలేసినట్లు విమర్శించారు. వికలాంగులకు అందించే పింఛన్లలో కోతలు విధించి, వారిని రోడ్డున పడేసేందుకు కంకణం కట్టుకున్నట్లు చెప్పారు. జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మురగయ్య, రాజా రెడ్డి పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

యాదమరి: హత్యకేసులో నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. పశ్చిమ విభాగ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ నాయుడు, ఎస్ఐ ఈశ్వర్ కథనం మేరకు.. తొట్టిగానిఇండ్లకు చెందిన విజయ్‌కుమార్(26) తమిళనాడు రాష్ట్రం పరదరామిలో ఆవులు వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో తన వ్యక్తిగత అవసరాల కోసం సన్నిహితుల నుంచి రూ.5 లక్షల వరకు అప్పుగా తీసుకున్నాడు. తీసుకున్న అప్పులు సమయానికి చెల్లించకపోవడంతో రుణదాతల నుంచి ఒత్తిడి ఎక్కువైంది. దీంతో కుటుంబసభ్యులను తన అప్పులను తీర్చమని వేధించసాగాడు. ఈ క్రమంలోనే ఈనెల పదో తేదీన తాను చేసిన అప్పులు చెల్లించడానికి అవసరమైన రూ.5లక్షలు ఇవ్వకపోతే ఇంటిల్లిపాదిని హతమారుస్తానని మద్యం మత్తులో బెదిరించాడు. ఈ క్రమంలో ఘర్షణ పడ్డారు. అప్పటికే హతుడు ఓ వివాహితతో వివాహేతర సంబంధం ఉండడంతో గ్రామంలో అవమానంగా భావించిన కుటుంబసభ్యులు ఆదివారం రాత్రి జరిగిన అగౌరవానికి భంగపడ్డారు. దీంతో హతుని తండ్రి సదాశివం, పెద్ద కుమారుడు శివకుమార్‌తో కలిసి పొలం దగ్గర నిద్రిస్తున్న విజయ్‌కుమార్‌పై విచక్షణా రహితంగా కర్రలతో దాడి చేసి గాయపరిచారు. కొనవూపిరితో కొట్టుమిట్టాడుతున్న అతడిని తాడుతో గొంతుకు బిగించి హతమార్చారు. అయితే ఎక్కడ తమపై అనుమానం వస్తుందోనని, పొలంలోని ఓ చెట్టుకు ఉరి వేసి హత్యను ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అయితే మృతుని తల్లి పరిమళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. హతునితో పాటు అతడి తండ్రి, సోదరుని శరీరంపై గాయాలుండంతో వారి ఇద్దరితోపాటూ మృతుని తల్లిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ ఈశ్వర్ తనదైన పంథాలో విచారించగా హత్యను తామే చేసినట్లుగా సదాశివం, శివకుమార్ నేరాన్ని అంగీకరించారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ ఈశ్వర్ చెప్పారు.

సౌత్‌జోన్ సీనియర్ ఉమెన్ క్రికెట్ టోర్నీ విజేత చిత్తూరు

అనంతపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియం వేదికగా జరుగుతున్న సౌత్ జోన్ సీనియర్ ఉమెన్ క్రికెట్ టోర్నీ విజేతగా చిత్తూరు జిల్లా జట్టు నిలిచింది. వరుసగా నాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించి చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. సోమవారం చిత్తూరు, కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నాలుగు వికెట్ల నష్టానికి కడప జట్టు 101 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చిత్తూరు జట్టు కేవలం 17.2 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 101 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో చిత్తూరు జట్టు నిలవగా, రెండో స్థానంలో అనంతపురం, మూడో స్థానంలో కర్నూలు, నాల్గో స్థానంలో కడప, ఐదో స్థానంలో నెల్లూరు జట్లు నిలిచాయి. విజేత జట్టుకు ట్రోఫీని జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి వి.భీమలింగారెడ్డి అందజేశారు.

టాస్క్ ఫోర్స్ బృందం తనిఖీ

యాదమరి: స్థానిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మోర్దానపల్లి ఉపకేంద్రాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసింది. సోమవారం మండల వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా గణాంక అధికారి జార్జి, ప్రోగ్రామ్ అధికారి రామ్మోహన్ మండలంలో పర్యటించారు. వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వైద్యసేవల రికారులు పరిశీలించడానికి వచ్చామని చెప్పారు.

వింత పోకడలతో కూటమి పాలన


ప్రభుత్వ ఉత్తర్వులు రద్దు చేయాలని నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: వింత పోకడలతో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి, మాట్లాడారు. సోమవారం అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి వినతి పత్రం అందజేశారు. విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కల్యాణ్‌భరత్ మీడియాతో మాట్లాడారు. హాస్టళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో పిల్లల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ సభ్యులు తప్ప ఇతరులు వెళ్లకూడదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. నెలరోజులుగా విద్యార్థుల సమస్యలపై వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు హాస్టళ్లు, పాఠశాల, కళాశాలలను సందర్శిస్తున్నారన్నారు. అది గిట్టని సర్కారు ఇటువంటి ప్రొసిడింగ్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. మొదలియార్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జ్ఞానజగదీష్, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేష్‌లు మాట్లాడారు. విద్యార్థులకు ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన బ్యాగుల నందు నాణ్యత లేదని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా విద్యార్థి జేఏసీ ఛైర్మన్ సద్దాం, స్టాండ్లీ, సిరాజ్, కరీమ్, జస్టిన్, రవి, మహేష్, వెంకటేష్, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.11.50 లక్షలు కాజేసిన సైబర్ మోసగాళ్లు

చిత్తూరు అర్బన్: సైబర్ మోసగాళ్లు పంపించే మెసేజ్‌లను చూసి..ఆశపడిన ఓ బ్యాంకు ఉద్యోగి రూ.11.50 లక్షలు పోగొట్టుకున్నాడు. దీనిపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చిత్తూరు ఎస్‌బీఐ బ్యాంకులో పనిచేస్తున్న డి.కృష్ణ అనే ఉద్యోగికి రెండు నెలల క్రితం ఓ మెసేజ్ వచ్చింది. టెలిగ్రామ్ గ్రూప్‌లో చేరి, కొద్దిమొత్తం స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని ఆ మెసేజ్ సారాంశం. దీంతో లింకుపై క్లిక్‌చేసి కృష్ణ.. పలు దఫాలుగా రూ.11.50 లక్షలు పెట్టుబడి పెట్టాడు. తీరా తానూ మోసపోయానని తెలుసుకుని పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.